క్లుప్తంగా

21న మంత్రి ఆనం సత్తెనపల్లి రాక

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఉపకార వేతనాలను ఈ నెల 21న సాయంత్రం 4 గంటలకు కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించనున్నారు. పట్టణంలోని వెంకటేశ్వర గ్రాండ్ కల్యాణ మండపంలో కార్యక్రమం ఉంటుందని ట్రస్ట్ చైర్మన్ , ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయ వర్గాలు గురువారం తెలిపాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నాయి.

జీవనోపాధి మెరుగుపడేలా చర్యలు



సత్తెనపల్లి: నియోజకవర్గంలోని కుల, చేతివృత్తిదారుల జీవనోపాధి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. జిల్లా వెనకబడిన తరగతుల సేవా సహకార సంఘ కార్యాలయ నిర్వాహక సంచాలకులు దుర్గాబాయి గురువారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని బీసీ సామాజిక వర్గాల వారందరికీ త్వరలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్, బీసీ కార్యాలయ సిబ్బంది అనిల్, సుష్మ, స్వర్ణ తదితరులు ఉన్నారు.

రెండు గ్రామాల్లో 'ఉపాధి హామీ' గ్రామసభలు

దమ్మాలపాడు (ముప్పాళ్ళ): మండలంలోని రెండు గ్రామాల్లో ఉపాధిహామీ పథకం సోషల్ ఆడిట్‌లో భాగంగా సోమవారం గ్రామసభలు నిర్వహించారు. కొత్త కార్డులు మంజూరు చేయాలని స్థానికులు కోరారు. పాత కార్డులను కూడా రెన్యువల్ చేయడం లేదని చెప్పారు. మస్టర్ షీట్‌లో లోపాలున్నట్లుగా అధికారులు గుర్తించారు. తనిఖీ బృందం సభ్యులు గుర్తించిన అంశాలను చదివి వినిపించారు. గ్రామ సభలో సర్పంచి కుమ్మరి ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ ఎం.లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్యుడి ఆయుధం సమాచార హక్కు చట్టం



నకరికల్లు: సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పరిష్కారం పొందవచ్చని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు శ్రీశైలం నాగార్జున, రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసాద్‌లు అన్నారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో చట్టం ప్రయోజనాలు, వినియోగంపై స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సెంటర్‌లో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల నుంచి సమాచారాన్ని ఈ చట్టం ద్వారా పొందవచ్చని అన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా పనిచేయాలంటే ఈ చట్టం ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు ముజావర్ జాన్‌అహ్మద్, ఉపాధ్యక్షుడు బద్దుల నాగేశ్వరరావు, కార్యదర్శి బి.వి.గిరి, ఆర్.ఎస్.రెడ్డి, ఎ.నాగేశ్వరరావు, కొప్పుల వెంకటేశ్వర్లు, వి.రాజేశ్వరరావు, ఎస్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కిరాణా వ్యాపారుల సహకారం అభినందనీయం



క్రోసూరు: పట్టణ ప్రజలకు తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయించేందుకు క్రోసూరు కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ముందుకు రావటం అభినందనీయం అని తహసీల్దార్ ఎం.సువర్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక ధనలక్ష్మి కిరాణా షాపులో ఏర్పాటు చేసిన రాయితీ స్టాల్‌ను ఆమె ప్రారంభించారు. కొనుగోలుదారులకు సరకులు అందించి, మాట్లాడారు. సివిల్ సప్లయిస్ డీటీ షేక్ గఫూర్, స్టాల్ ప్రొప్రయిటర్ చుండూరు మల్లికార్జునరావు, కిరాణా వ్యాపారులు దేవరశెట్టి నాగేశ్వరరావు, ఎర్రబాలెం కొండలు, కూరపాటి లక్ష్మీనారాయణ, కోటా ప్రభాకరరావు, కోటా భాస్కరరావు, , పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణాలకు రక్షణ

- నిబంధన పాటించని వాహన చోదకులు
- అవగాహన పెంచుతున్న జిల్లా పోలీసులు
- నూతన చట్టం అమలుకు అధికారుల చర్యలు



హెల్మెట్ లేకుండానే ప్రయాణిస్తున్న దృశ్యం



బైకును లారీ ఢీకొట్టడంతో రోడ్డుకు తల తగిలి మృతి చెందిన చల్లా రామకృష్ణారెడ్డి (ఫైల్)

సత్తెనపల్లి: ద్విచక్ర వాహనాల చోదకులు హెల్మెట్ ధరించకపోవడం ప్రాణాంతకంగా మారుతోంది. ముఖ్యంగా నేటి యువత బైకులపై అతి వేగంతో వెళుతున్నారు. దీనికి తోడు హెల్మెట్ కూడా పెట్టుకోకపోవడంతో ప్రమాదాల బారిన పడి కుటుంబ సభ్యులకు తీరని దుఃఖం మిగులుస్తున్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు ముమ్మరం చేశాయి. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా వాహనాల రిజిస్ట్రేషన్‌కు అనుసంధానం చేశాయి. కొత్త వాహనం కొనుగోలు సమయంలోనే హెల్మెట్ తీసుకోవాలని షరతు విధించాయి. ఈ మేరకు రవాణాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. రవాణా శాఖ కార్యాలయానికి వచ్చే వాహన యజమాని కొత్త హెల్మెట్, దాని బిల్లును సమర్పిస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా నిబంధనలు రూపొందించారు. ఈ నిబంధనలు ఎప్పటి నుంచో అమల్లో ఉన్నా ... ఆచరణకు నోచుకోలేదు. ఈ విషయంపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీ చేయడంతో హెల్మెట్ వినియోగంపై దృష్టి మళ్లింది. మోటార్ వెహికల్ చట్టం -138 (ఎఫ్) ప్రకారం వాహనాలు విక్రయించే డీలర్లు విధిగా హెల్మెట్‌ను అందుబాటులో ఉంచాలి. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే న్యాయ శాఖ, రవాణా శాఖ, పోలీస్ శాఖ అధికారులు హెల్మెట్ వాడకంపై క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నారు. దీని కోసం ప్రత్యేక తనిఖీలు కూడా చేపడుతున్నారు. అధిక జరిమానాలను కూడా విధిస్తున్నారు. కనీసం ఆ భయంతోనైనా హెల్మెట్ అలవాటు చేసుకుంటారని అధికారులు భావిస్తున్నారు.

నాణ్యత లేకుంటే ప్రయోజనం శూన్యం

పోలీస్ కేసుల నుంచి తప్పించుకునేందుకు నాణ్యత లేని హెల్మెట్లను కొనుగోలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని అధికారులు చెబుతున్నారు. ఫుట్‌పాత్‌లపై లభించే హెల్మెట్ల వల్ల ధర తగ్గినా... ప్రాణ రక్షణకు గ్యారెంటీ ఉండదని పేర్కొంటున్నారు. చిన్న ప్రమాదాల్లో కూడా వాహన చోదకులు కింద పడితే ఇలాంటి హెల్మెట్ పగిలి వాటి వల్ల కూడా గాయాలపాలైన సందర్భాలు అనేకం ఉన్నాయని అధికారులు గుర్తుచేస్తున్నారు.

విస్తృత ప్రచారం అవసరం

హెల్మెట్ వాడకంపై కరపత్రాలు పంచడంతోపాటు ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పాఠశాలలు, కళాశాలల్లో యువతకు అవగాహన కల్పించాలి.

ప్రాణం కన్నా ఏదీ ముఖ్యం కాదు



మనిషికి ప్రాణం కన్నా ఏదీ ముఖ్యం కాదు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ప్రాణాపాయం నుంచి తప్పించుకోవాలి. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారు. హెల్మెట్ పెట్టుకుంటే ఎవరికి వారు రక్షించుకున్నట్లే. అంతా మన చేతుల్లోనే ఉంది. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. లేనిపక్షంలో అపరాధ రుసుము, కేసులు నమోదు వంటివి తప్పవు.

–జి.గురునాథ్‌బాబు, డీఎస్పీ, సత్తెనపల్లి

శిరస్త్రాణం ప్రాధాన్యతపై అవగాహన ముఖ్యం



పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు



మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకట నాగ శ్రీనివాసరావు

సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వెంకట నాగ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమే కాకుండా శిక్షార్హమని అందరూ అవగాహన పెంచుకోవాలని సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు వారి సూచనల మేరకు గురువారం న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వేద జూనియర్ కళాశాల, శ్రీసరస్వతి శిశు మందిర్ విద్యార్థులు పాల్గొన్నారు. సత్తెనపల్లి మార్కెట్ యార్డ్ వద్ద న్యాయస్థానాల ప్రాంగణం నుంచి 400 మంది విద్యార్థులతో పట్టణంలోని గడియార స్తంభం , ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న కోర్టు వరకు భారీ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి వెంకట నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయొద్దన్నారు. ఇది ప్రమాదకరంతోపాటు నేరమని చెప్పారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడపడం శిక్షార్హం అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. తలకు తీవ్ర గాయం కావడం వల్లే ఎక్కువ మంది యువత చనిపోతున్నారని గుర్తు చేశారు. పిడుగురాళ్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు మాట్లాడుతూ.. 20 నుంచి 35 ఏళ్లలోపు వారు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులోని వారు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, రెండో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్, పట్టణ ఎస్ఐ ఎం. సంధ్యారాణి తదితరులు కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.నరసింహారావు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ షేక్ బాలిసైదా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్ కుమార్, న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, పోలీసులు, కోర్టు సిబ్బంది, విద్యార్థులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేప చెట్టు నరికిన వారిపై కేసు నమోదుకు వినతి



సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తున్న జైపాల్, నాయకులు

సత్తెనపల్లి: పచ్చని వేప చెట్టును నరికిన వారిపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్‌కు పలువురు నాయకులతో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న తాలూకా సెంటర్‌లో వందేళ్ల నాటి వేప చెట్టును అకారణంగా నరికి వేశారన్నారు. వాల్టా చట్టం ప్రకారం ప్రభుత్వం నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకున్నాకే నరకాల్సి ఉంటుందని గుర్తుచేశారు. ఈ విషయంపై అన్న క్యాంటీన్ కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. ఇలాంటి చెట్లను భవిష్యత్తులో నరకకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. 12వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్ మాట్లాడుతూ.. చుట్టూ ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద చెట్టును నరికినా ఎవరూ పట్టించుకోవడం గమనార్హమన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెట్టు నరికివేతకు సంబంధించిన ఫొటోలు, వినతి పత్రాన్ని అందించారు. వీటిని జిల్లా అటవీ శాఖ అధికారికి, సత్తెనపల్లి ఎంపీడీవోకి, మండల వ్యవసాయ అధికారికి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈకి, మున్సిపల్ కమిషనర్‌కి, సత్తెనపల్లి డీఎస్పీకి పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు యాసారపు బాబు, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నందిగామ యల్లమంద, నాయకులు గంటా ఏసుబాబు, యానాది, తదితరులున్నారు.

కుష్ఠుతో ఎవ్వరూ అంగవైకల్యానికి గురికాకూడదు



కంటెపూడిలో మచ్చలను గుర్తిస్తున్న నాగేశ్వరరావు నాయక్



దొడ్లేరులో సర్వే చేస్తున్న సిబ్బంది

సత్తెనపల్లి డీపీఎంఓ నాగేశ్వరరావు నాయక్

సత్తెనపల్లి: కుష్ఠుతో ఎవరూ అంగవైకల్యానికి గురికాకూడదని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ (డీపీఎంఓ) డి.నాగేశ్వరరావు నాయక్ అన్నారు. ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటి సర్వేలో భాగంగా గురువారం సత్తెనపల్లి మండలం కంటిపూడిలో సర్వేను ఆయన ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సత్తెనపల్లి పట్టణంలోని మూడు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 15 బృందాలు, సత్తెనపల్లి మండలం పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 59 బృందాలు ఈ సర్వే చేస్తున్నాయన్నారు. ఒక్కో సర్వేలో మేల్ వలంటీర్, ఆశా కార్యకర్త ఉంటారని చెప్పారు. వీరిపై పర్యవేక్షణకు ఏఎన్‌ఎంలు ఉంటారన్నారు. సత్తెనపల్లి పట్టణంలో గురువారం 1,200 ఇళ్లను సందర్శించి 3,900 మంది వివరాలను తెలుసుకుని సర్వే చేశామన్నారు. 18 మంది అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించామని చెప్పారు. సత్తెనపల్లి మండలంలో 1,434 ఇళ్లను సందర్శించి 4,887 మంది జనాభాను సర్వే చేశామని చెప్పారు. 9 మంది అనుమానిత లక్షణాలు కలిగి ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం చిన్నకోటమ్మ, ఆశ కార్యకర్త, మేల్ వలంటీర్, పాల్గొన్నారు.

క్రోసూరు మండలంలో...

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమైనట్లు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఇన్నారావు తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌పీహెచ్‌లు సుమారు 20 నుంచి 25 గృహాలు రోజూ సర్వే చేస్తారని చెప్పారు. తొలిరోజు దొడ్లేరు గ్రామంలో సర్వే కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణాధికారి శిఖాశ్యాంసన్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎస్వీ రంగారావుకు ఘన నివాళి



ఎస్వీ రంగారావు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కన్నా నాగరాజు, కళాకారులు

సత్తెనపల్లి: సినీ నటుడు ఎస్వీ రంగారావు వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వ నట చక్రవర్తి ఎస్వీ రంగారావు కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు బి.సుబ్బారావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎస్వీ రంగారావు నటనను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ జి శ్రీధర్, మాజీ కౌన్సిలర్ తోట అంబిక, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, న్యాయవాదులు కె.వి.భాస్కర్ రెడ్డి. పి. వెంకట కోటయ్య, కూరపాటి విజయ శంకర్, శిరసాల భుజంగరావు, పెద్దింటి వెంకటేశ్వర్లు, దూబగుంట్ల జానకి రామారావు, డి.శ్రీనివాసరావు, పెండ్యాల మల్లయ్య, సుధాకర్, అప్పాపురపు నరేంద్ర, పి విజయ, అంచుల నరసింహారావు, తోట ఏడుకొండలు, కళాకారులు వి చెన్నకేశవ రావు, ఆదం తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో సాధు సంతుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో హిమాలయ గురువు తదితరులు

వినుకొండ(నూజెండ్ల): శాంతి ఆశ్రమం ట్రస్ట్, హిమాలయ గురువు ఆధ్వర్యంలో తొలి ఏకాదశి తృతీయ అఖండజ్యోతి ప్రజ్వలన నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 108 మంది సాధుసంతులు విచ్చేసి నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో నిర్వహించిన సమావేశంలో అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం సర్వ లోక కల్యాణార్థమై జరిపించామని పేర్కొన్నారు. రైతులు, వ్యాపారుల కార్మికులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం సాధు సంతులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శాంతి ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు కనిగండ్ల కోటేశ్వర రావు, పెండేల పుల్లారావు, కాశీ, సురేష్, ఆర్ఎస్ఎస్ తరపున కాశీ, గజవల్లి పవన్, భాగవత్ రవికుమార్ హాజరయ్యారు. కడప జిల్లా కంది మల్లాయపల్లె బ్రహ్మంగారి మఠం వీర బ్రహ్మేంద్ర స్వామి 8వ తరం ముని మనవడు నొస్సం వీరంభట్లయ్య స్వామి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరిశుభ్రతే పరమౌషధం!

వానాకాలం అంటేనే సీజనల్ వ్యాధులు విజృంభించే సమయం. ఇప్పటికే పలు ప్రాంతాల్లో డయేరియాతోపాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అతిసారతో కొన్ని ప్రాంతాల్లో ప్రాణాలు కూడా పోతున్నాయి. కొన్నిసార్లు ప్రాణాపాయం తప్పినా ఆస్పత్రి ఖర్చులు రూ.వేలల్లో ఉండటం పేద, మధ్య తరగతి కుటుంబాలకు పెద్ద భారమేనని చెప్పాలి. దీనికంతటికీ పరిష్కారం పరిశుభ్రతే. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దరిచేరనీయకుండా చూసుకోవచ్చు. అటు ఆరోగ్యపరంగా, ఇటు ఆర్థికంగా కూడా కుటుంబం హాయిగా ఉండొచ్చు. ఇది ఎవరికివారు జాగ్రత్త పడాల్సిన సమయం. మరోవైపు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వైద్య నిపుణులు కూడా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మున్సిపల్ యంత్రాంగం కూడా మురుగు కాలువల్లో పూడికతీత, ఇళ్లలో రోజువారీ వచ్చే వ్యర్థాల తొలగింపు, దోమల నివారణపై దృష్టి సారించింది.

- సీజనల్ వ్యాధుల విషయంలో జాగ్రత్తలు ముఖ్యం
- నిత్యం అప్రమత్తత అవసరమంటున్న వైద్యనిపుణులు
- పారిశుద్ధ్యంపై దృష్టి సారించిన మున్సిపల్ యంత్రాంగం



రఘురామ్‌నగర్‌లో కాలువలను శుభ్రం చేస్తున్న కార్మికులు

సత్తెనపల్లి: వ్యాధుల విషయంలో ప్రజలు నిత్యం చైతన్యవంతులై అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే అనారోగ్యాల బారిన పడతారని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను అందరూ పాటించాలని ప్రచారం చేస్తున్నారు. పట్టణం, గ్రామ పంచాయతీలలో స్టాప్ డయేరియా, డెంగీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నామని గుర్తుచేస్తున్నారు. వ్యాధుల నివారణకు సహకరించి ఇళ్ల వద్దకు వచ్చే వైద్య సిబ్బంది సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలంటున్నారు. అడపాదడపా ముసురు పట్టి కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే చేపట్టాల్సిన చర్యలను వివరిస్తున్నారు. దీనిలో భాగంగా పట్టణంలోని మురుగు కాలువల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి తొలగింపజేస్తోంది.

అధికారులు వీటిపైనా దృష్టి పెడితేనే...

తాగునీటి పైపులకు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలి. వీధి కుళాయిల వద్ద సిమెంట్‌తో నీరు నిల్వ లేని విధంగా ఏర్పాటు చేయాలి. ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రపరిచేలా చూడాలి. దోమలు పెరగకుండా పరిసరాల్లోని నీటి కుంటలను వెంటనే పూడ్చి వేయాలి. పూడ్చడానికి వీలులేని నీటి కుంటలలో కిరోసిన్‌గానీ, మడ్ ఆయిలుగానీ వేస్తే దోమల లార్వాలు నశిస్తాయి. ఆ మేరకు చర్యలు తీసుకోవాలి. మురుగు కాలవల్లో ఉన్న అడ్డంకులను తొలగించి ఎప్పటికప్పుడు నీరు పారేలా చేయాలి. పట్టణ, గ్రామ పరిసరాల్లోని చెత్తాచెదారాలను తొలగించి బ్లీచింగ్, సున్నాన్ని 1:4 నిష్పత్తిలో కలిపి చల్లాలి. దోమల నివారణకు ఒక భాగం మలాథియన్‌కు, 10 భాగాల నీటిని కలిపి నాప్సాక్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయాలి. దోమల నివారణకు ఒక లీటరు పైరెత్రమ్‌కు 20 లీటర్ల డీజిల్ కలిపి ఫాగింగ్ నిర్వహించాలి.

ప్రజలపరంగా ఆచరించాల్సినవి...

వర్షపు నీరు చేరకుండా గృహ పరిసరాల్లో ఉన్న పనికిరాని వస్తువులు, రోళ్లు, పగిలిపోయిన మట్టి కుండలు, టైర్లు, పూలకుండీలు, తాగి పారేసిన కొబ్బరి బొండాలు వంటి వాటిని తొలగించాలి. అలాగే సెప్టిక్ ట్యాంక్ ఎయిర్ పైపుల పైన జల్లెడలకు పలుచని వస్త్రాన్ని చుట్టాలి. ఇలా చేస్తే సెప్టిక్ ట్యాంకు లోపల దోమలు గుడ్లు పెట్టకుండా అరికట్టవచ్చు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా నీటి తొట్టెలను శుభ్రపరిచి, ఆరబెట్టి, తిరిగి నీటితో నింపడం వల్ల దోమల లార్వా పెరుగుదలను అరికట్టవచ్చు. దోమ లార్వా నివారణకు 10 లీటర్ల నీటిలో 5 మీ.లీ. ఎబేట్ ద్రావణాన్ని కలిపి నీటి నిల్వలపై పిచికారీ చేయాలి. కలుషిత నీటిని తాగడం వల్ల వ్యాధులు వస్తాయి. డయేరియా, కలరా, టైఫాయిడ్, కామెర్లు వంటి ప్రాణాంతక వ్యాధులు ఈ కాలంలో సంక్రమిస్తాయి. సురక్షితమైన, క్లోరినేషన్ చేసిన, కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వీధుల్లో లభించే అపరిశుభ్ర ఆహారం, తినుబండారాలు వంటివి తినకూడదు. విరేచనాలు, వాంతులు, జ్వరం ఉన్న వారు అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను లేదా ఏఎన్‌ఎంలను సంప్రదించి తక్షణ వైద్య సహాయం పొందాలి. దోమకాటు వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా లాంటి ప్రమాదకర వ్యాధులు వస్తాయి. దోమలు పెరిగే అవకాశం లేకుండా మీ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. మున్సిపల్/పంచాయతీ డ్రెయినేజీలలో చెత్త వేసి పారిశుద్ధ్య సమస్యలు పెంచొద్దు. డ్రెయినేజీ లేని ఏరియాలలో నీరు నిల్వ ఉండే మంచినీటి కుళాయిల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి. ఖాళీ స్థలాల్లో వాటి యజమానులు తక్షణమే పిచ్చి మొక్కలు, వ్యర్థాలు ఉంటే తొలగించాలి.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

వినుకొండ(నూజెండ్ల): మండల పరిధిలోని పెద కంచర్ల గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య, పిల్లల అదృశ్యంపై ఫిర్యాదు

నరసరావుపేట టౌన్: భార్య, పిల్లలు కనిపించటం లేదని భర్త ఇచ్చిన ఫిర్యాదుతో అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. రామిరెడ్డిపేటకు చెందిన కొలిశెట్టి సాంబశివరావు కిరాణ దుకాణం నిర్వహిస్తూ ఉంటాడు. గత కొన్ని రోజులుగా భార్య గీతతో మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో గీత తన కుమారుడు, కుమార్తెను తీసుకొని ఈ నెల 13వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. వారి కోసం గాలించినా ప్రయోజనం దక్కలేదు. ఈ మేరకు సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పదో తరగతిలో సత్తా చాటాలి

- క్రమశిక్షణతో చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించండి
- గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాదాత నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల: విద్యాభ్యాసంలో పదో తరగతి మైలురాయివంటిదని, ప్రతి విద్యార్థి బాగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని గోల్కొండ గ్రూపు సంస్థ చైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతి విద్యార్థి పోటీతత్వంతో పరీక్షలు రాసి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను ఇంటికి వెళ్లి చదవాలని చెప్పారు. దీంతో పాఠ్యాంశాలు చక్కగా గుర్తుండి పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చన్నారు. పదిలో మంచి మార్కులతో సత్తా చాటి ట్రిపుల్ ఐటీలో సీట్లు సంపాదించాలని ఆకాంక్షించారు. తద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌ఎం సుందరరావు, గ్రామ పెద్దలు యన్నం శివారెడ్డి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ సీట్ల సాధన అభినందనీయం

ఈ ఏడాది ట్రిపుల్ ఐటీలో నలుగురు విద్యార్థులు సీట్లు సాధించటం గ్రామానికే గర్వకారణమని రామిరెడ్డి చెప్పారు. సీట్లు సాధించిన జెల్దిచెర్రీ, సరిమెళ్ళ జాన్‌జోయల్, దంతం గాయత్రి సంజీవని, షేక్ ముబీనాలను గురువారం అభినందించారు. పాఠశాలలో ఈ ఏడాది 61 మంది విద్యార్థులకు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారని గుర్తుచేశారు.

రాయితీ సరకులను సద్వినియోగం చేసుకోండి



సరకులు పంపిణీ చేస్తున్న ఆర్‌డీఓ మురళీకృష్ణ

సత్తెనపల్లి: రాయితీపై అందించే బియ్యం, కందిపప్పును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సత్తెనపల్లి ఆర్‌డీఓ వి.మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని గుంటూరు రోడ్‌లోని శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లులో గురువారం రాయితీపై బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలో సబ్సిడీ ద్వారా కిలో బియ్యం రూ.49, కందిపప్పు రూ.160కి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాన్ని నడిపేందుకు ముందుకు వచ్చిన గుండా పూర్ణ చంద్రరావును అభినందించారు. పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ అరుణ, ఆర్యవైశ్య నాయకులు డి. శ్రీనివాసరావు, మద్ది వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.